క్లుప్తంగా

నిధులు మంజూరు

బ్రహ్మంగారిమఠం : బి.మఠం నుంచి చౌదరివారిపల్లె వరకు 8 కిలోమీటర్లు సింగల్ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్బీ నిధుల ద్వారా రూ 2.50 కోట్లతో త్వరలో రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్టు ఏఈ తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. రోడ్డు నిర్మాణంలో కొంతమేర సీసీ రోడ్డు నిర్మాణం కూడా ఉంటుందన్నారు. బి.మఠంలో ఆర్అండ్బీ స్థలంలో ఎవరైనా ఆక్రమించుకుంటే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

8న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణను ఆపాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్ఓ ఆధ్వర్యంలో ఈనెల 8న చేపడుతున్న విద్యాంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.దస్తగిరి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, పీడీఎస్ఓ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు మాట్లాడారు.

నేడు ప్రత్యేక సమావేశం

కాశినాయన : నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని సుందరయ్యనగర్‌లో సంచార జాతుల వారి స్థలాలను ఆక్రమించారని చెబుతూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ 1980లో ఇచ్చిన 12 ఎకరాల భూమిని తప్పుడు రికార్డులు సృష్టించి అమ్ముకున్నారన్నారు. సంచార జాతుల వారు అధికారులను కలిసినా న్యాయం జరగలేదని తెలిపారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు అరబోలు చంద్రశేఖర్, బీజేపీ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి

గోపవరం : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు అంతంత మాత్రమే సాగునీరు అందుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో రబీ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సీజన్‌లో తక్కువ కాలం, నీటి ఆదాకు సంబంధించిన పంటలు పెసర, నూగు, మినుము, జొన్న తదితర పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అందుకు సంబంధించి రైతుభరోసా కేంద్రాల్లో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

గోపవరం : ఈనెల 14 నుంచి ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలని గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. గురువారం గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలకలకు ఆడుదాం ఆంధ్రకు సంబంధించి వాలీబాల్ ఆటను ప్రాక్టీస్ చేయించారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ క్రీడల్లో పాల్గొనవచ్చని, ఇప్పటికే ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలను సేకరించి ప్రాక్టీస్ మొదలు పెట్టామన్నారు. బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర ఆటలకు సంబంధించి పూర్తిస్థాయిలో ప్రాక్టీస్ చేయిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, అన్నిశాఖలను ఇందుకోసం కమిటీలుగా నియమించడం జరిగిందన్నారు.

డిసెంబర్ 10న పోటీలు

కడప కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న గీతా జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నామని ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు గోపీబాబు, బెస్తవేములు రామ మహేష్ తెలిపారు.

గురువారం నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో పలు ధార్మిక సంస్థల ప్రతినిధులు విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను తెలిపారు. ఆరు, ఏడు తరగతులు జూనియర్ విభాగంగా, 8, 9 తరగతులు సీనియర్ విభాగంగా నిర్ణయించామన్నారు. 3 వ అధ్యాయం కర్మయోగం 30 శ్లోకాలపై పోటీ నిర్వహిస్తామన్నారు. సంపూర్ణ భగవద్గీత మీద 18 ఏళ్ల లోపు జూనియర్ విభాగంగా, ఆపైబడిన వారు సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహించనున్నామన్నారు. అన్ని విభాగాలలో బహుమతులను ఇస్తామన్నారు. చైన్నె రోడ్డులోని శ్రీ లలితా పంచాయతన దేవాలయంలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు


గూడెంలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ గడపకు వెళ్లినా ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నిండాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డులోని గూడెం, తిరువెంగళాపురం పంచాయతీలోని శ్రీరామ్‌నగర్, గాండ్లతిమ్మాయపల్లెల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవి కావని, నేడు మన జగనన్న ప్రభుత్వంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. పేదలకు మంచి చేయకుండా ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేస్తున్నా పేదల సంక్షేమం కోసం అవేమీ లెక్క చేయకుండా మొక్కవోని ధైర్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని అన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ చక్రపాణిఉమ, మండలాధ్యక్షుడు బోడపాడు రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ క్రిష్టారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘురామిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, వార్డు ఇన్‌చార్జిలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంతోనే అభివృద్ధి సాధ్యం


రెగ్యులర్ ఏఈ నియామకాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదిస్తున్న కౌన్సిలర్లు

మైదుకూరు : మున్సిపాలిటీలో ప్రజలు ఫిర్యాదు చేసిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. చైర్మన్ అధ్యక్షతన గురువారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు కౌన్సిలర్లుగా ఎన్నుకున్నాక ఆయా వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతారని తెలిపారు. అలాంటి సమస్యలను పరిష్కరించినప్పుడే మున్సిపాలిటీ అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇందుకు అధికారుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో వీధి లైట్లు లేవని, సీసీ రోడ్లు వేయాలని, తాగునీటి పైపులైన్లను మరమ్మతులు చేయాలని పలువురు టీడీపీ కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్లు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అనంతరం మైదుకూరు మున్సిపాలిటీలో రెగ్యులర్ ఏఈ కావాలని కోరుతూ మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు తీర్మానం చేశారు. ఇన్‌చార్జి ఏఈగా ఉన్న ఎల్.నిరంజన్‌రెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. అదేవిధంగా అభివృద్ధి పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లు, కౌన్సిలర్లకు బిల్లులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడుతూ, తమ నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని కౌన్సిలర్లు అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ

బద్వేలు అర్బన్ : మహిళలు స్వయంశక్తితో ఎదగాలని సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్యలు తెలిపారు. సంఘమిత్ర సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న 70 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక సిద్ధవటం రోడ్డులోని సంఘమిత్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు ఇటువంటి శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, సంఘమిత్ర అధ్యక్షులు సొద్దలపెంచలయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాపాడు : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు గురువారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి కీలక మెట్టు అన్నారు. దీని తర్వాత ఎలాంటి విద్య, ఉద్యోగ అవకాశాలు ఉంటాయో విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను వారి లక్ష్యాలను చేరుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా స్పెషలాఫీసర్ నాగలక్షుమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీ నీటి విడుదల పొడిగింపునకు ప్రయత్నం


మాట్లాడుతున్న ఏఈ జాన్సన్

ప్రొద్దుటూరు : సాగులో ఉన్న పంటలను రక్షించేందుకు కేసీ కెనాల్ నీటి విడుదలను పొడిగించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఉన్నతాధికారులను సంప్రదించారని కేసీ కెనాల్ ఏఈ జి.జాన్సన్ తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి అధ్యక్షత గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో పంటలను రక్షించేందుకు కేసీ కెనాల్ ద్వారా యథావిధిగా నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు ఆయకట్టు నీరు వాడుకుంటున్నందున దిగువకు నీరు తగ్గిందే తప్ప నిలుపుదల చేయలేదన్నారు. ఈనెల 18వ తేదీ వరకు నీటి విడుదలను పొడిగించాలని ఎమ్మెల్యే, ఎంపీ కోరడం జరిగిందన్నారు. అలాగే మైలవరం జలాశయం ద్వారా నీటిని తీసుకొచ్చి చాపాడు కెనాల్ ద్వారా అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తాగునీటి అవసరాల కోసం చెన్నమరాజుపల్లె, నాగాయపల్లె చెరువులకు నీటిని నింపినట్లు చెప్పారు. ఏపీఎస్పీడీసీఎల్ రూరల్ ఏఈ నరసింహారెడ్డి , ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడారు. ఎంపీటీసీ మంజుల వసుంధర మాట్లాడారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు సంబంధించి సున్నా వడ్డీ మంజూరు కాని వారు ఎవరైనా ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు నెల రోజుల గడువును ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, ఎంపీడీఓ కె.కుళ్లాయమ్మ, రూరల్ సీడీపీఓ అరుణకుమారి, అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు


కుంటల్లో గంబూసియా చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని పలు గ్రామాల్లో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో వైద్యాధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టారు. కామనూరు పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది గురువారం కాకిరేనిపల్లె, పెద్దశెట్టిపల్లె, అమృతానగర్, చెన్నమరాజుపల్లె గ్రామాల్లోని కోనేరు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు దోమల నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతివారం డ్రైడే పాటించాలని చెప్పారు. డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామనూరు, కల్లూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

చౌడూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం

చౌడూరు గ్రామంలో గురువారం డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెలలో పీహెచ్‌సీ పరిధిలో 2 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా 412 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 17 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఎంఎస్ తేజ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

బద్వేలు అర్బన్ : రెవెన్యూ డివిజన్ పరిధిలోని బద్వేలు, పోరుమామిళ్ల, బి.మఠం ప్రాంతాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా గురువారం మంచినీటి కుంటల్లో గంబూసియా చేపలు వదిలినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూసియా చేపల ద్వారా మంచినీటి కుంటల్లో పెరిగే దోమల లార్వాలను నశింపజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆయా మండలాల పరిధిలోని ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు చాపాడులో 'జగనన్నకు చెబుదాం'

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం వరకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులందరూ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలకు తమ పరిధిలో ప్రభుత్వ పరమైన ఎలాంటి సమస్యలు ఉన్న జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి సమస్యను పరిష్కరించటం జరుగుతుందని ఎంపీడీఓ తెలియజేశారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి

గోపవరం : మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వారం వారం పురోగతి కనిపించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ హసీనాతో కలిసి అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్న ఇళ్ళు, ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు తదితర పనులకు సంబంధించి సమీక్షించారు. డిసెంబర్ చివరిలోపు ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలని, విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం వహించినా అందుకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుదారుల ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఉద్యమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.జగదీష్ తెలిపారు. గురువారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్ డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యునాని మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్ర విభజన పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కడపలో యునాని మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఆరిఫ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాష పేర్కొన్నారు. గురువారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2016లో దాదాపు 25 ఎకరాల స్థలాన్ని సేకరించిందని అందులో వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. కడప నగరం అభివృద్ధి జరిగే క్రమంలో యునాని మెడికల్ కాలేజీ మెడికల్ రీసెర్చ్ సెంటర్ల ఏర్పాటుకు వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

19న పూర్వ విద్యార్థుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ ఉదయం 11 నుంచి 1 గంట వరకు పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. 1973 నుంచి ఇప్పటి వరకు కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరి వివరాలు సేకరించేందుకు, కళాశాల అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 9963410546, 9701283665 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

11న చిత్రలేఖన పోటీలు

కడప కల్చరల్ : బాల బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈనెల 11వ తేదీన కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ రాజశేఖర్ రాహుల్ వెల్లడించారు. గురువారం కడప బాలోత్సవం చిత్రలేఖనం పోటీల వాల్‌పోస్టర్లను ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 ఉదయం 9 గంటలకు పాఠశాలల విద్యార్థులకు జరిగే చిత్రలేఖన పోటీలను సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యత


బి.మఠం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వచ్చే వేసవి నాటికి ప్రతి గ్రామంలో తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మంసాగర్‌లో నీరు తక్కువగా ఉందని రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. మండలంలో పలుసమస్యలను ఎంపిటీసీలు, సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వంలో గ్రామాల్లో మంజూరైన పనులను సంబంధిత గ్రామ పంచాయతీల తీరుమానాలతో త్వరలో పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు ఉన్న తహసీల్దార్ సువర్ణాదేవి మొటేషన్లు, విద్యార్థులకు కావల్సిన పత్రాల్లో సంతకాలు కూడా చేయాలన్నా ఆన్‌లైన్ సేవలకు వెళ్లండి అంటున్నారని చెప్పారు. నేషనల్ హైవే రహదారిలో భూములు కోల్పోయిన రైతులు పరిహారం అందించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మండల స్థాయిలో జరుగుతున్న శాఖపరమైన పురోగతిని సభా దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి. పీఆర్ డీఈఈ మల్లేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఈఓఆర్డీ జానొకెనడా, సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి. ఎంపిటీసీలు,సర్పంచ్‌లు, వివిధశాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏ ప్రభుత్వంలో ఇంతటి అభివృద్ధి జరగలేదు


భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గతంలో ఏ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో ఇంతటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 32వ వార్డు పరిధిలోని స్టేట్ బ్యాంకు వద్ద నుంచి బీజీఆర్ వీధి వరకు రూ.20లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ కాలువ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపుగా మున్సిపాలిటీలో సిమెంటు రోడ్లు, కాలువలు లేని వీధులు లేవని అన్నారు. రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, 24వ వార్డు కౌన్సిలర్ కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లేటి శంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానవతా దృక్పథాన్ని పెంపొందించాలి


బియ్యం ఇస్తున్న లెక్చరర్

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'స్టూడెంట్ బెస్ట్ ప్రాక్టీస్'లో భాగంగా దీన జనోద్ధరణ పథకం కింద పిడికెడు బియ్యం కార్యక్రమం జరిగింది. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవతా దృక్పథాన్ని, ఇతరులకు సహాయం చేసే గుణాన్ని పెంపొందించడం కొరకు 'స్టూడెంట్ బెస్ట్ ప్రాక్టీస్' కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరూ ఎవరికి తోచినంత బియ్యాన్ని కళాశాలకు ఇవ్వడమన్నారు. ఈ బియ్యాన్ని అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు ఒక్కరోజు అన్నదానానికి అందచేస్తామన్నారు. ఒక్కొక్కరు ఇచ్చే పట్టెడు బియ్యం మరొకరి కడుపు నింపుతుందన్నారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని బియ్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు సీబీఐటీ విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న సీబీఐటీ యాజమాన్యం

చాపాడు : తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 1న నిర్వహించిన జేఎన్‌టీయూ - ఏ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) విద్యార్థిని డి.ఖ్యాతివర్ధన్‌రెడ్డి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. సీబీఐటీలో బీటెక్ మూడో సంవత్సరం (ఈసీఈ) చదువుతున్న ఖ్యాతి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ నెల 9న కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే పోటీలలో పాల్గొననున్నట్టు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో సమస్త ఆత్మల పండుగ


సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


ప్రొద్దుటూరు కల్చరల్: అలంకరణలో సమాధులు

బద్వేలు అర్బన్ : స్థానిక సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్‌చర్చిలో గురువారం నిర్వహించిన సమస్త ఆత్మల పండుగను (సమాధుల పండుగ) క్రైస్తవులు చర్చి ఆవరణలోని సమాధులను అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి అభిషిక్త గురువర్యులు రెవ. నందంఐజక్, రెవ.ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రతి ఏటా నవంబర్ 2న నిర్వహించుకునే ఈ పండుగలో పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ జి.కిరణ్‌ఎడ్వర్డ్, ట్రెజరర్ ఎం.సునీల్‌కుమార్, కౌన్సిల్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని సమాధుల తోటలో గురువారం ఆత్మల పండుగ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధులను శుభ్రం చేసి రకరకాల పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. సంఘ గురువులు అబ్రహం ప్రేమ్ చంద్ బాబు, స్టీఫెన్ బాబు, రాజు బాబు, లాంబెర్ట్ బాబు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న చల్లా మధుసూదన్ రెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి సద్వినియోగం అయ్యేలా చూడాలని జేసీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డి తెలిపారు. స్థానిక హోమస్ పేటలోని జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి కార్యాలయంలో గురువారం సచివాలయ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమం అన్నారు. గృహ సారథుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. ప్రతి కార్యక్రమంలో వీరు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. సమావేశంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు కల్లూరు నాగేంద్రారెడ్డి, పోతుల శివారెడ్డి, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జిలు పోసా భాస్కర్, కాకర్ల నాగేశారెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఓబయ్య యాదవ్ పాల్గొన్నారు.

నిఘంటువులు పంపిణీ


నిఘంటువులు అందుకున్న విద్యార్థినులతో సంస్థ ప్రతినిధి ప్రసాదరెడ్డి

కలసపాడు : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాదరెడ్డి గురువారం కలసపాడులోని సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో బాలబాలికలకు ఉచితంగా నిఘంటువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిత్తాప్రభావతి సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.